
# కథ

# బ్రెయిన్ డ్రెయిన్

యమ్.ఆర్.దూబగుంట



''కరీం రాసుకో. జాతి ముర్రా. రంగు నలుపు. వయస్సు నాలుగు సంవత్సరాలు. ఎత్తు 117 సెం.మీ. పొడవు 131 సెం.మీ. చెవిపోగు నెంబరు 6095. కొమ్ములు కుడి 27 సెం.మీ. ఎడమ 26 సెం.మీ.''

చెప్పుకొని పోతున్నారు అల్లూరు పశువుల ఆసుపత్రి డాక్టరు పెంచలయ్య.

★ ★ ★

వయస్సు ఇరవై రెండు. ఎత్తు 161 సెం.మీ. బరువు 68 కిలోలు. ఛాతీ- గాలి పీల్చక పూర్వం 98 సెం.మీ. గాలి పీల్చిన తర్వాత 102 సెం.మీ. కంటి చూపు నార్మల్. చదువు ''ట్రిపుల్ 'ఈ'లో బి.టెక్. పేరు సాయికిశోర్. తండ్రి పేరు రామారావు. తండ్రి ఉద్యోగం రిటైర్డ్ టీచర్ కం పోస్టుమాస్టర్. ఊరు అల్లూరు దగ్గర బట్రకాగొల్లు గ్రామం. ఇతర అర్హతలు 'సాప్' ప్రోగ్రాంలో డిప్లమా.''

అప్లికేషన్ చదివాడు 'గ్లోబల్ టెక్నాలజీస్' ఎగ్జిక్యూటివ్ ఆర్నాల్డ్.

★ ★ ★

నెల్లూరు జిల్లా అల్లూరు మండలం బట్రకాగొల్లు గ్రామం. ఊరి మధ్యలో చిన్న పెంకుటిల్లు. దానికి పలుపుతాడుతో కట్టేసిన నల్ల ముర్రా గేదె. దూరంగా మరో కొయ్యకు కట్టేసిన పెద్ద ముర్రా గేదె. చిన్న గేదెను కొనడానికి వచ్చిన అల్లూరు బ్యాంకువారు, అల్లూరు పశువుల డాక్టరు, ఇన్సూరెన్స్ ఏజెంటు, లబ్ధిదారుడు వెంకయ్య.

డాక్టరుగారు చెప్తున్న గుర్తులన్నీ అసిస్టెంటు కరీం హెల్త్ సర్టిఫికేటులో పొందుపరుస్తున్నాడు.

★ ★ ★

ఎదురుగా కూర్చున్న సాయికిశోర్‌తో ''మా కంపెనీ బ్రాంచీలు చాల వరకు అమెరికాలో వున్నాయి. ఏదో ఒక బ్రాంచీలో మీరు 'ఊ' అంటే ప్లేస్‌మెంట్ ఇస్తాము'' అన్నాడు ఆర్నాల్డ్. మొత్తం ప్యాకేజీ నెలకు రెండు లక్షలు. అది కాకుండా అదనపు అలవెన్సులు మరో డెబ్బయి అయిదు వేలకు వుంటాయి'' చెప్పుకొని పోతున్నాడు ఆర్నాల్డ్. ''మరో మూడు రోజుల్లో మీ పాస్‌పోర్టు, వీసా అన్నీ రెడీ చేస్తాం. రెడీగా వుండండి.''

★ ★ ★

ఈ గేదెను చిన్నప్పటినుండి రామారావు ముద్దు పేరు లక్ష్మి అని పెట్టుకొని పెంచాడు. తన బడిపంతులు జీతం అరకొరగా సంసారాన్ని ఈడ్చడానికి సరిపోగా కొడుకు చదువు కోసం ఉన్న రెండెకరాల మెట్ట పొలం అమ్మి ఇంజనీరింగ్ హైదరాబాదులో చదివించాడు. మిగిలింది చిన్న పెంకుటిల్లు. ఈ రెండు గేదెలు. భార్య రామలక్ష్మి జబ్బుమనిషి. ఉన్న ఒక్కగా నొక్క కొడుకు చదివి, ఉద్యోగం తెచ్చుకుని తనను ఆదుకుంటాడని రిటైరైన తనకు, తన భార్యకు ఆసరాగా వుంటాడని ఆశ పడుతున్నాడు రామారావు. కొడుకు కిశోరంటే ఎంత గారాబమో ఈ గేదె కూడా అంతే రామారావుకు. కొడుకు ఉద్యోగ ప్రయత్నానికి డబ్బు కోసం తెచ్చిన అప్పు తీర్చడానికి ఈ గేదెను అమ్మేశాడు చివరకు.

★ ★ ★

హైదరాబాదు నుండి స్వగ్రామానికి బయలుదేరాడు కిశోర్. 'స్వదేశంలో తన చదువుకు వచ్చే సంపాదనకు విదేశాలలో నాల్గింతలు సంపాదించవచ్చు. అమ్మా నాన్నలకు చెప్పి ఎలా వొప్పించాలి?' తన ఆలోచనలకు బ్రేక్ పడింది. ''కాగొల్లు కాగొల్లు'' కండక్టర్ అరుపు. ఎయిర్ బ్యాగ్‌తో బస్సు దిగాడు.

''అబ్బాయ్ ఇదేనా రాక? చదువయిపోయిందటగా, ఉద్యోగం వచ్చిందా? ఇన్నాళ్లు వాళ్లు కష్టపడ్డారు. ఇంక సుఖపడాలి'' పొరుగింటి యల్లయ్య పలకరింపు.

''ఏరా కిశోర్, ఎప్పుడు రాక? మొత్తానికి ఈ ఊరి వాడొకడు ఇంజనీరైనాడు. ఇంకా ఇంకా చదివి ఈ గ్రామ పరిస్థితులు మార్చాలి'' చిన్ననాటి మిత్రుడు గోవింద్ పలకరింపు.

అడుగులో అడుగు వేసుకుంటూ ఊరి మధ్యలో చింతచెట్టు నీడన ఉన్న పెంకుటిల్లు చేరాడు. విశాలమైన లోగిలి. దిగుడు బావి. చుట్టూ చింత, మామిడి చెట్లు, వెదురుపొదలు. ఇంటి ముందర అరుగు మీద

చుట్ట కాలుస్తూ రామారావు. కొడుకును ఆర్నెల్ల తర్వాత చూడటం. పండుగలకు రమ్మని ఫోన్ చేసినా ''ఇంటర్వ్యూలున్నాయి. ఉద్యోగ ప్రయత్నాలలో వున్నాను'' అని దాటేశాడు కిశోర్.

''ఏమేవ్, ఎవరొచ్చారో తెలుసా?'' అని భార్యను కేకేశాడు. రామలక్ష్మి చేస్తూన్న పనిని ఆపి చీరకొంగుతో చేతులు తుడుచుకుంటూ గుమ్మం చేరింది. ''రా నాయనా! ఎప్పుడు తిన్నావో ఏమో, స్నానం చేసిరా!'' అని నీళ్లందించింది అమ్మ.

అన్నం ముందు కూర్చున్నాడనే గానీ అమ్మ నాన్నలకు ఎలా చెప్పాలి తన ఉద్యోగం సంగతి. ఆలోచనలో పడ్డాడు. ముందు కూర్చుని విసనకర్రతో విసురుతూంది రామలక్ష్మి. నాన్న బయట పోయేవాళ్లతో తనను గురించి చెబుతూ ''అబ్బాయి వచ్చాడు, పుల్లయ్య చదువైపోయింది. ఉద్యోగం రావాలి'' అంటున్నాడు.

''నీకేం రామారావు, అదృష్టవంతుడివి. రత్నం లాంటి అబ్బాయిని కన్నావు'' పుల్లయ్య అభినందన. ''ఏంట్రా ఆ తినడం. పట్నంలో ఈ ఆర్నెల్లు ఏం తిన్నావో ఏమో, ఎలా సన్నబడ్డావో చూడు'' అమ్మ మాటలతో ఉలిక్కిపడ్డాడు కిశోర్.

★ ★ ★

''చెవిపోగు వేయి కరీం. ఇంకా పందొమ్మిది గేదెలను కొనాలి'' డాక్టరుగారి ఆదేశం. బలవంతంగా ఆ గేదె గొంతుకు చేంతాడు చుట్టి చెట్టుకు కట్టి నలుగురు మనుషులు- ఒకరు కొమ్ములు, ఒకరు తల, ఒకరు తోక, ఒకరు పొట్ట పట్టుకున్నారు.

కరీం ఇన్సూరెన్సు వాళ్లిచ్చిన చెవిపోగు 6095 అప్లికేటరు సహాయంతో ఒక్కసారిగా గేదె చెవికి నొక్కాడు. అంతే. 'అంబా అంబా' అని అరుపు. బాధతో చెట్టు చుట్టూ పరుగు. ఆ అరుపులకు ప్రక్క కొయ్యకు కట్టేసిన తల్లిగేదె కంటతడి. కానీ ఏం లాభం. పలుపుతాడు బంధం. బాధతో ఊర్కొండిపోయింది. అదే మనిషి అయితే బాధతో విలవిలలాడుతూ తన బాధ మాటల్లో తెలిపేవాడు. మూగజీవి. దాని బాధ ఎవరు అర్థం చేసుకుంటారు. తల్లిగేదె కంటతడి పెడ్తూంటే, కంటినిండా నీళ్లతో, పోలేక పోలేక కొనుక్కున్న వ్యక్తిని అనుసరించింది గేదె.

★ ★ ★

అందరికీ భోజనాలయ్యాక నెమ్మదిగా ''నాన్నా, ఉద్యోగం వచ్చింది'' చెప్పాడు కిశోర్.

''ఏంట్రా, ఉద్యోగం వచ్చిందా! ఏందిరా ఆ నాన్చుడు? ఎక్కడేమిటి?'' గుచ్చి గుచ్చి అడిగాడు రామారావు.

''ఈ రాష్ట్రం, కనీసం ఈ దేశం కాదు నాన్నా. అమెరికన్ కంపెనీ. రెండులక్షల జీతం. వాళ్ల అమెరికా శాఖలో చేరాలి. వెంటనే బయలుదేరాలి'' చెప్పాడు కిశోర్.

''అటు డాలర్ల ఆహ్వానం, ఇటు బాధ్యతల గాలం.''


స్నేహితులలో చాలమంది విదేశాలలో సెటిలై బాగా సంపాదిస్తూ ఇండియా కొచ్చినపుడు ఆ విశేషాలు, ఆ జీవితం వివరిస్తూంటే ఊహా లోకాలలో తేలాడు. ఏమైతేనేమి వెళ్లడానికే నిర్ణయించాడు.

మౌనంగా విన్న రామారావు స్వరం గద్గదమైంది. ఊర్లో టీచరుగా పని చేసి పిల్లలందరికీ మాతృదేశ గొప్పతనం, స్వదేశం మీద చూపాల్సిన అభిమానం, విదేశీ వస్తు బహిష్కరణ వివరంగా చెప్పిన రామారావుకు కోపం నెత్తికెక్కింది. ''ఏంట్రా నువ్వనేది. ఎక్కడో వేల మైళ్ల దేశానికి భిక్షాటనకు వెళ్తున్నావా? ఏం, మన దేశం గొడ్డుబోయిందా ఉద్యోగాలకు. ఏం పర్వాలేదు. వెళ్లాల్సిన పని లేదు. మాకా వయసు దాటింది. ఏదో నీవు చదివి మాకు ఆసరాగా, ఇన్నాళ్ల మా శ్రమకు, మాకు తోడు నీడగా ఉంటావని ఆశిస్తే నీవు చేసే నిర్వాకం ఇదా?

''అమెరికా అట, అమెరికా. ధనం జీవితానికి ఇంధనంరా. అంతే కానీ అదే జీవితం కాదురా. అనుబంధాలు, ఆత్మీయతలు, బంధాలు, బాంధవ్యాలు అన్నీ వదులుకుని ధన వ్యామోహంతో అక్కడకు వెళ్తున్నావ్. ఏం, ఇండియా పనికిరాలేదా ఏమి? అక్కడ రెండులక్షలు నెలకు సంపాదిస్తూ, అంట్లు తోముకుంటూ, మురికి గుడ్డలు ఉతుక్కుంటూ కష్టపడేదానికన్నా, ఒకడి మోచేతి నీళ్లు త్రాగేదానికన్నా, ఇక్కడ ఏ ముప్పయి, నలభై వేలు సంపాదిస్తూ దర్జాగా పనిమనుషులను పెట్టుకుని దొరగా బ్రతకటం నేర్చుకో. నీ చదువుకు బీజం ఈ దేశం. నీ జన్మకు స్థానం ఈ దేశం. నీవు పెరిగిన వాతావరణం, పీల్చిన గాలి, నడిచిన భూమి ఈ దేశంది. ఇన్నాళ్లు నిను మోసిన ఈ దేశ ఋణాన్ని మరిచి విదేశీ వ్యామోహంలో నీ విజ్ఞానాన్ని, చదువును పరాయివాళ్లకు, పరాయి దేశానికి తాకట్టు పెడుతున్నావా? ఆలోచించు'' రామారావు మాటల వరదకు అడ్డుకట్ట వేస్తూ రామలక్ష్మి ''నాన్నా, నా ఆరోగ్యం అంతంతమాత్రం. ఏదో నీవు పైకొచ్చి మాకు అండగా ఉంటావని ఆశించాము. నాన్న మాట విని ఇక్కడే ఏదో ఉద్యోగం చూసుకో'' అంది. అహ, కిశోర్ మనసు కరగలేదు. వెంటనే ఎయిర్ బ్యాగ్ భుజానికి తగిలించుకున్నాడు హైదరాబాద్ వెళ్లడానికి. రామారావు, రామలక్ష్మి గొల్లుమన్నారు.

ఒకప్రక్క గూటిలో ముసలి జంట, మరో ప్రక్క ఊహాలోకంలో విహరిస్తున్న రెక్కలొచ్చిన పక్షి. అటు డబ్బు కోసం లేగదూడ నుండి పాడిగేదె వరకు పెంచి పోషించి, సంతలో అమ్ముకుంటున్న వైనం. ఇటు మన దేశ విజ్ఞాన సంపదను డాలర్లు ఎర వేసి, పలుపు తాడుతో తోలుకెళ్తున్న విదేశీ కంపెనీలు. ''అమ్ముడుబోవడంలో ఆ సంతగేదెకు, ఈ చదువుకున్న యువతకు తేడా లేదేమో'' రామారావు ఆలోచనలో పడ్డాడు కళ్లనిండా నీటితో.

☆



## చేపల పులుసు జిందాబాద్!

**డైటింగ్ విషయంలో జాగ్రత్తగా వుంటానని చెప్పే అశిన్- ఏ రోజయినా ఇంట్లో చేపల పులుసు చేస్తే ఏమాత్రం నోరు కట్టుకోలేదట. చేపల పులుసు చూస్తే చాలు, ఆమెకి నోరూరిపోతుందిట. అంతే ఇక డైటింగ్ గీటింగ్ జాన్తానై అంటుందిట. మామూలుగా తినే పుద్దుకన్నా బాగా ఎక్కువగా లాగించేస్తానని మొహమాటం లేకుండా చెబుతుంది అశిన్. అంత బాగా చేపల పులుసు చేస్తారట ఆమె ఇంట్లో.**